నిజానికీ అబద్ధానికీ మధ్య



శ్రీకాంత్ శర్మ

వేసవికాలం ఇంకా ముదరనప్పుడు_
కాలవనీరు చల్లగా ఉంది_
పడవ నడుస్తోంది_
చుక్కానిదగ్గర గుడ్డిదీపం వెలిగించుకొని పడవ ఆసామీ కూనిరాగాలు తీస్తున్నాడు. వెన్నెలలేదు_
చీకటి మనుషుల్ని కప్పుతోంది

చూడండీ !— ఇది నిజం —.
అనిపించింది ఇప్పుడే —
నేను వెతకబోయే, ఒక సత్యాన్ని, 'అతను' నిరూపించడం — అందులోనూ నేను ఎక్కువగా ప్రేమించే 'అతను' —
చిత్రం అనిపిస్తుంది — తెల్లబోతాను.

* * *

వెలిగేగుడ్డిదీపం, కనీకనపడని మొహాల్ని తడుముతోంది —

దూరంగా....పడవఅంచున కూర్చుని కాలవ నీళ్ళలోకి ఒక కాలు వేసి, కదుపుతూ - రెండోకాలు ఎత్తుచేసి, గడ్డం ఆన్చి - చుట్టూ మనుషుల మాటల్నీ - మినుకు మినుకుమనే నక్షత్రాల్ని చూస్తోన్న 'అతను'-మొదటి పరిచయం నాకు ——

ఏం సంబంధంలేని కొందరి మనుషుల ముఖాల్లో కనిపించే ఒక ఆకర్షణ, దగ్గరికి లాగుతుంది - తెలీకండానే - మనల్ని-

'అతనూ' - అంతే ——

ఖరీదైనప్యాంట్ - పొడుగుచేతుల చొక్కా- చల్లటిగాలికి ఎగిరిపడేజుట్టు -

అన్నిటినీ మించి ఆకర్షించే ఆ 'మౌనం' -

ఆనాడే-చూడగానే పలకరించాలని పించింది. అలాగే, మసకగా కనిపించే అతనికేసి చూస్తూ కూర్చున్నా -

నీటిని చీల్చుకువెళ్ళే పడవనడక - నీళ్ళచప్పుడు - రాత్రి -

కొందరి సాన్నిధ్యాన్ని, మాటలు అక్కర్లేకండానే,ఆనందంగాఅనుభవించ వచ్చనిపించింది - అదే మొదటిసారి - అలా అనిపించడం -

తెలతెలవారబోతోంది - పడవ ఆగింది - నిద్రపోయిన వాళ్ళు లేచి, తువాళ్ళు దులుపుకుని - ఒడ్డుకి దూకి వెళ్ళి పోతున్నారు -

అతనూ దిగాడు -

నేనూ, పలకరిద్దామని ఒడ్డుమీదికి వచ్చేంతలో అతను చరచర నడిచి, ముందుకి వెళ్ళిపోయాడు.

ప్రత్యేకంగా పిలవడానికి - పేరుతెలీక కొంత - ఏం మాట్లాడ్డానికీ లేక కొంత- అడ్డువచ్చిన అహం కొంత - కారణం - పిలవకపోవడానికి ——.

అతను వెళ్ళిపోయాడు ——

ఆ చీకటిరాత్రి, చల్లనినీరూ, గాలీ, సాక్షిగా - నిజం - అతనంటే నా కిష్టం- అబద్ధంకాదు - ఆ పరిచయం ఈ నాటికీ జ్ఞాపకం !—

* * *

అలా - అయిపూరుకుంటే బాగుణ్ణు - కాని - అంతటితో ఆగక, ఇంకా జరిగింది కొంత ——.

రెండోసారి - హఠాత్తుగా కాలేజీలో కనిపించాడు ——

ఓ మిత్రుణ్ణి తొందరగా కలుసుకుని మాట్లాడదామని వెళుతూన్నా-దూరంగా, క్లాస్‌లోంచి వెళ్లిపోతూ కనిపించాడు -

పలకరించా లనిపించింది. ఈ సారి మరీ మరీ - కాని ——

ఇప్పుడు ఇంకొకందుకు భయపడ్డాను- అతని తరహా చూస్తే - డబ్బున్న ఒక... 'అహం' తోస్తుంది - ఆ మౌనం మరీ- ఏదో గోడకట్టినట్టు అనిపిస్తుంది -

తప్పకండా మాట్లాడాలి -

నా అంతట నేనుకంటే - ఇద్దరికీ కలిసినస్నేహితుడు ఎవరన్నా పరిచయం చేస్తే బాగుణ్ణనికోరిక !——

దూరంగా మసలే మనుషులు ఒక తరహాగా బాధించి, వింతగా దగ్గరవుతారు — చిత్రం ! — వాళ్ళ సాహచర్యం కోసమే — తెలియని తాపత్రయం.

*　　*　　*

అనుకున్నంతా జరిగింది —

రామావతారం కనిపించాడు ఓ రోజు — అతనితో — నాకు ఆత్రుత ఎక్కువైంది — కావాలనే ఎదురు వెళ్ళాను —

రామావతారం నన్ను పలకరించి, అతన్ని పరిచయం చేశాడు —

"ఈయన పేరు ఆనందమోహన్ — కాలేజీలో చదువుతున్నారు — మంచి స్నేహం కోరతారు.....ఇతను శర్మ — ఖాళీ ప్రస్తుతం — ఇతని మెదడు — ఉద్యోగం చేస్తున్నాడు —"

అతనీ పరిచయం విని నవ్వి ——

"అహాఁ ! —" అని —

"సాయంత్రం సరదాగా కాలేజీవైపు వస్తారా — కబుర్లు చెప్పుకుందాం — సరదాగా — అలా ఎక్కడైనా వెళదాం — పనేమైనా ఉంటేమాత్రం, ఇంకోసారి కలుద్దాం - ఏమంటారు ?" అన్నాడు, చాలా సౌమ్యంగా —

రామావతారం, సాయంత్రం నాదగ్గిరకి వస్తానన్నాడు — కలిసివెళదాం — అన్నాడు. ఇద్దరూ వెళ్ళిపోయారు.

*　　*　　*

సాయంత్రం......

కాలేజీ వదిలారు —

సుబ్బారావూ, నేనూ కలిసివెళ్ళాం — ఇద్దరం, లైబ్రరీకి ఎదురుగా ఉన్న తోటలో, సిమెంట్ బెంచీ మీద కూర్చున్నాం —

రామావతారం - అతనూ - ఎటో వెళ్ళుతూ లైబ్రరీదగ్గిరకి వస్తే - చప్పట్లు కొట్టి పిలిచాను. రామావతారం వస్తామన్నట్టు సౌంజ్ఞ చేశాడు —

"అనుగ్రహించాడు -" అని నవ్వి, సుబ్బారావు కబుర్లు మొదలెట్టాడు —

లైబ్రరీ రూందగ్గిర ఎవరో నలుగురైదుగురు అమ్మాయిలు కనిపించడం — ఆనందమోహన్‌ని పలకరించడం — అతని సమాధానాన్ని వినిగాబోలు — పకపక నవ్వుకుంటూ వెళ్ళిపోవడం —

చెట్ల చాటునించి — చెదిరీ — కదిలీ — కనిపిస్తున్నాయి — మాకు —

రామావతారం, అతనూ, ఇనపతలుపు తోసి, లోపలికివచ్చారు —

"ఓ ! —...అనుకున్నట్టూ వచ్చారే! —" అంటూ — థాంక్స్‌చెప్పి — ఆనందమోహన్ నవ్వుతూ వచ్చి కూర్చున్నాడు —

సుబ్బారావుకి అతని మీద ఏం అభిప్రాయం కలిగిందో ఇంకా తెలీలేదు -

"నువ్వూ కూర్చో రామూ — "
అన్నాడు ఆనందమోహన్ —

కాని, రామావతారం వినయం ప్రదర్శించి, "నీకుతెలుసో తెలీదో — ఈయన మంచి ఆర్టిష్టు శర్మా — బాగా పాడతారు — పత్రికల్లో అప్పుడప్పుడు

ఈయన బొమ్మలు పడుతొంటాయి —" అంటూ, ఫౌంటెన్ గట్టుమీద — నీటిజల్లు దగ్గిరగా కూర్చున్నాడు —

సుబ్బారావు వాళ్ళిద్దరివైపూ చూస్తున్నట్టున్నాడు — అన్నాడు —

"అహా(— అవును — ఎక్కడో పేరు చూసిన జ్ఞాపకం — మీ రన్నమాట —"

ఆనందమోహన్ స హ జ ం గా అనాల్సినమాటగా — " పో ని ద్దు రూ — ఏవోపడతాయి - వాళ్ళు డబ్బిస్తారు - అవి మన ఖర్చులుకి చెల్లు—ఏది యేమయినా, నాకువచ్చిన ఈ మాత్రంపేరుకి రామావతారం కారణం — నిజంచెప్పాల్సివస్తే-"

"అదేంమాట — ఒట్టిదండీ -" అని ఏదో అనబొయ్యాడు -

"అహా(- అలా అనకు -నువ్వేఅంత శ్రద్ధతీసుకోకపోతే — నే నె వ ర్ని — చెప్పు పోనీ — ఏవండీ — అంతేనా ! "— అన్నాడు మావైపు చూస్తూ —

"కావచ్చు - రా మా వ తా ర ం మన స్సలాంటిది -" అన్నాడు సుబ్బారావు -

కాసేపు మౌనం —

కవులూ, కథకులూ, చిత్రకారులూ - పాటలూ - అన్నిటిగురించీ, చక చక తోచిన నిర్వచనాలు చేసి ఊరుకున్నాడు-

మనిషిది కళాత్మకమైన శరీరం - చూడగానే ఆకర్షిస్తాడు - పెద్ద అందం లేదు - అతనిలో గొప్ప ఆకర్ష ణల్లా - ఆ మౌనం -

ఏవో స్వవిషయాలు - కళ్ళల్లో - మరి లోతుల్లో బాధఅనేది ఏమన్నా కదులుతుందేమో ! -

నన్ను చాలా ఆకర్షించాడు - కొన్ని నిర్వచనాలతో - రామావతారం అతన్ని వదలడుట - అలాఅని అతనే అన్నాడు -

మనిషిని మనిషి ప్రేమించడానికి ఏం అర్థం లేకపోవడం ము ఖ్య ల క్ష ణ ం గాబోల్ను -

అతన్నిచూస్తే - బాగా డబ్బున్నవాడని అనిపిస్తుంది -

రామావతారం సరే - అతనిగురించి నాకు తెలుసు -

ఆనందమోహన్‌లో మ రో ముఖ్య విశేషం గు ర్తించా-అతను ప్రపంచాన్ని, ఆనందాన్ని, ఎక్కువగా ప్రేమిస్తాడు - వాళ్ళచేత ప్రేమింపబడా లని ఆశిస్తాడు - ప్రయత్నిస్తాడు - బహుశా అసహ్యించుకోవడానికి ఎవళ్ళూ లేన ట్టున్నారు - అదృష్టం - అతనిదికాదు-అసహ్యించుకోబడనివాళ్ళది -

రామావతారం - అతనూ, చీ క టి పడేవరకూ మాతో కబుర్లుచెప్పి వెళ్ళిపోయాడు.

"అతను మనుషుల్లో మానవత్వాన్ని ఉపయోగించుకోగల డనడానికి నిదర్శనం అన్ని విధాలా అల్పు డని. అందరికీ అని పించే, రామావతారాన్ని అ త నొక్కడే అదరించగలగడం -" అంటున్నాడు సు బ్బా రా వు - రాత్రి నాతో యింటికివచ్చి పడుకోబోయే ముందు.

ఎప్పుడన్నా రోడ్డుమీద కనిపిస్తే, చిరునవ్వుతో – "కులాసా !" – అని మాత్రం అని – "పనివుంది" – అంటూ వెళ్ళిపోయేవాడు – గొప్ప స్నేహానికి చిహ్నం – ఆ స్నేహం మౌనంలో పరీక్షించడం అంటాడుశాస్త్రి ఇప్పుడు అభిప్రాయం ఏమన్నా మారిందేమో ఉత్తరంరాసి కనుక్కోవాలి.

ఆఫీస్ ఇన్స్‌పెక్షన్ హడావిడిలో కొన్నాళ్ళపాటు అసలు ఊపిరి తిరగకుండా – ప్రపంచంలోంచి విడిపడి మిగిలిన ప్రత్యేకవ్యక్తిలా – యంత్రంలా – పని చేశాను.

ఆ రోజు సాయంత్రం ఆఫీస్ పని పాటు ఊపిరమిగిలిన పుటలక్, తలనుండి తొలగించి – కాఫీతాగి – రోడ్డు మీదికి వచ్చాను.

సాయంత్రం అయిపోయింది.

దూరంగా రామావతారం రివ్వున సైకిల్ మీద వస్తూ నాదగ్గర వాలి –

"భాయీ – నీకోసం వెతుకుతున్నా – ఒక్క సహాయం చెయ్యాలి !" అన్నాడు, ఆయాసంగా – మొహంమీద చెమటతో.

"ఇంటికిరా – నెమ్మదిగా చెప్పు ఏమిటో –" అన్నాను.

నడుస్తున్నాం –

"నువ్వు చేస్తానని మాట ఇయ్యి –"

"సరే – చెప్పు –"

మొదలెట్టాడు – "నాకు వెంటనే ఓ పాతికరూపాయలు కావాలి."

"ఎందుకు ?"

"ఎందుకా ! – పరీక్షకి డబ్బుకట్టాలి – నువ్వో పాతిక ఇస్తే, మిగతాది ఇంకొందరి దగ్గర సర్దుబాటు చేసుకుంటా – మా నాన్నకి మానర్స్ లేవు – డబ్బు పంపాడనుకో – హోటళ్ళకి – కాఫీలకి – ఇలా... వాటికే సరిపోయేలా గీసి గీసి పంపిస్తే, ఎలా చావడం చెప్పు – అందుకని... చెప్పడం మరిచిపోయాను – ఇంకో వారంలో పరీక్షకి కట్టాల్సినడబ్బు పంపిస్తానని రాశాడు – చెప్పలేము ఎల్లుండే ఆఖరి రోజు – చెప్పేది ఏమిటంటే – నువ్వొక్క పాతిక – చాలు – మిగతాది నేచూసుకుంటా –"

రామావతారం సంగతి అంతే –

తండ్రి ఆస్తి లేనివాడేమో – నెలకి ఓ ఆరవై రూపాయలు లోప్పుగా పంపుతాట్ట.

ఒకసారిగా జోలు... టెర్లిన్ షర్టూ – సాటింజన్ పాంట్ – వేసుకు కనిపించాడు.

డబ్బువస్తుంది – ఖర్చు చేస్తాడు.

లేనిరోజున మాసినవీ, చినిగినవీ – బట్టలు వేసుకుని – ఇల్లు కదలడు – అలా కూర్చుంటాడు. 'అబ్బ ఈ చాకళ్ళున్నారే – హారిబుల్' – అని వాళ్ళని తిడతాడు – పెద్ద ఇదిగా.

ఒక్కొక్కసారి తిండి ఉండదు – మోతుబరీగా కబుర్లు చెప్పి, నవ్వించి, మిత్రుల కారేజీల్లో మిగిలిన అన్నం

తినేసి, వాళ్ళదగ్గిర కాస్త మొరటుహాస్యం వొలకబోసి – ఇంటికి చక్కావస్తాడు. దేనికీ సిగ్గుపడడు – దేన్నీ అసహ్యించుకోడు. జీవితంమీద ఓ నిశ్చితాభిప్రాయం లేదు.

ఓసారి అడిగాను ఎప్పుడో – జ్ఞాపకం లేదు –

"ఆ డబ్బు అలా విరజిమ్మి ఖర్చు చేసి – తరవాత ఇబ్బంది పడేబదులు ముందే కాస్త – చూసుకు ఖర్చుచేసుకోరాదూ !'' అని.

నవ్వి, అంటాడు – మనకి ఏడుపు రావచ్చు ఆ నవ్వుచూసి –

"ఇలాచూడు – నా చెయ్యిచూశావా – ఎన్నిచిల్లు లున్నాయో వేళ్ళ సందున – ఇంకేం నిలబడుతుంది చెప్పు డబ్బు – ఉన్నప్పుడు ఖర్చుచెయ్యాలి – లేనప్పుడు – మామూలే – ఉంటే ఆగేది లేదు – నా వీక్నెస్ అది –" అని

ఈ నాడు పరీక్షకి డబ్బు కట్టాలంటాడు – వాళ్ళ నాన్న పంపాడో మానాడో – అడక్కూడదు, అలా అయితే నా ముందుండడు.

"సరేలే – ఇస్తా" అన్నాను –

చాలా సంతోషించాడు – స్నేహం అనేదానిమీద చాలా పెద్ద వ్యాఖ్యానం చేశాడు.

స్నేహం హృదయాలకి పడ్డ ముడి అన్నాడు.

డబ్బు పోతే సంపాయించుకోవచ్చు – గొప్ప స్నేహం ఎలావస్తుంది – అన్నాడు.

డబ్బిచ్చాను.

పరీక్షకి డబ్బుకట్టేశాక మళ్ళీ కనిపిస్తానన్నాడు – వెళ్ళిపోయాడు.

అన్నాడుగనక మనం నమ్మాలి.

ఆ డబ్బు వెనక్కి రాదని తెలుసు – రానక్కర్లేదు – రామావతారం చెప్పినట్టు అది స్నేహౌన్నత్యం కాదు.

దేనికేనా తెగించే రామావతారం – అతని మనస్సు నిర్మలత్వం, ఇష్టం.

తనని తను నిలుపుకోలేని అశక్తతని చూస్తే – జాలేస్తుంది.

* * *

రామావతారం మనస్తత్వం ఇప్పటికీ నాకర్థం కాలేదు. ఎప్పటికీ కాదేమో కూడా.

ఈ డబ్బు – అడగడానికి ముందే, ఏదో సందర్భం వస్తే అడిగాను –

"ఎప్పుడన్నా ఆనందమోహన్ ఇంటికి వెళ్ళావా !''

"లేదు –" అన్నాడు.

"అదేం ! – అంత స్నేహితుడు గాదా !" అన్నాడు.

"అతనిది ఈవూరుకాదు – ఇక్కడికి దగ్గిరగా ఉన్న '......' – అతనిఊరు – వాళ్ళమ్మగారు అక్కడ ఉంటున్నారు – అక్కడో ఇల్లుందిట – నా అంతట నేనే – వస్తానన్నాను. రావద్దన్నాడు – డబ్బుని అసహ్యించుకోడం నేర్చుకోమన్నాడు. డబ్బే, గొప్పా, ఏదా



"అదృష్ట వంతుడివోయ్. మీ అల్లుడు డాక్టరుటగా, నీకు నడుం, ఒళ్ళునెప్పి బాగా తగ్గించా డని విన్నాను. ఇప్పుడే బాగా ఆరోగ్యంగా కనిపిస్తున్నావ్"

"అబ్బే అతను డాక్టరు కాదండి. ఇప్పుడు వంటపనీ అవీ అతనే చూస్తున్నాడు."

తారతమ్యాల్ని కలిగిస్తుందన్నాడు-అంతా ఏకం కావాలన్నాడు. నా కేం కావాలన్నా-హోటల్ బిల్స్ - అవీ - అతనే చెల్లించే వాడు'' అని చెప్పాడు.

ఆనంద మోహన్ వింతమనస్తత్వం, రామావతారం మాటల్లోకి వచ్చేసరికి - కొత్తరూపం తొడుక్కోలేదు గదా!

గొప్పవాళ్ళ గురించి పుస్తకాల్లో చేసిన వర్ణనలకీ, వాళ్ళ నిజ జీవితాలకీ ఏం సంబంధం ఉండదుట-రామావతారమే అన్నాడు వెనక - దీన్ని ఏవిధంగా అర్థం చేసుకోవాలి, అని - నా తికమక!

ఊహల్లో కనిపిస్తాడు ఆనంద మోహన్ - నవ్వుతాడు మనుషుల్ని చూసి - కొద్దిగా మాట్లాడతాడు - పత్రికల మించి డబ్బుచేస్తాడు - నలుగురి అల్పుల మధ్య గొప్పవాడుగా బతికి, వాళ్ళని ప్రేమిస్తూ బతకడం అతని జీవితాదర్శమేమో!-

* * *

ఏప్రియల్ నెలచివర -

పరీక్షలయ్యాయిట - సుబ్బారావు ఆ సాయంత్రం సినిమాకి రమ్మన్నాడు.

ఆనంద మోహన్ వేసిన బొమ్మలేవో కనిపించాయి ఆ మధ్య కొన్ని పత్రికల్లో - అతను - నాకుమాత్రం కనిపించలేదు. ఈ మధ్య రామావతారం సంగతే తెలియ లేదు.

సుబ్బారావు చెప్పాడు - ఆనంద మోహన్ ఆఖరి పరీక్షనాడు కనిపించాట్ట-

పలకరించాట్ట — వాళ్ళ వూరు త్వరలో వెళ్ళిపోతున్నట్టు చెప్పాట్ట — సుబ్బారావు తన ఆటోగ్రాఫ్ చూపించాడు — అందులో ఆనంద మోహన్ రాసిన వాక్యం — సుబ్బారావులాగే — నాకూ వింతగా కనిపించింది.

"మనిషికి సమాజంలో ఎప్పుడండీ గౌరవం—ఉదాహరణ నేనేఅనుకుంటా—"

అందులో ఒక 'అహం' తన అస్తిత్వాన్ని తను పరిపూర్ణంగా గుర్తించుకున్న ఒక రేఖ—కనిపించాయి స్పష్టంగా

సుబ్బారావు ఉగ్రుడయ్యాడు.

"తనలాగే షోకుగా బట్టలు వేసుకు తిరిగి, తనలాగే, పత్రికల కెక్కినవాడే—సమాజానికి గౌరవనీయుడు — కట్టే బట్టతోనూ — సంస్కారంతోనూ కబుర్లు చెబితేనే గౌరవం అన్న మాట—ఇవి—లేనివాడు కాడనేనా — ఏమిటీమాటల్లో అర్థం! అహంకారంతప్ప!"—

ఆటోగ్రాఫ్ లో ఆ కాయితం చింపి, అవతలపారేసి —

"అక్కడే చేద్దును ఈ పని — మర్యాదస్తుడుగదా అని ఊరుకున్నా!" అన్నాడు సుబ్బారావు. సినిమాకి వెళ్ళాం.

మాతో మరోఇద్దరు మిత్రులుకూడా వచ్చారు — సుబ్బారావూ, వాళ్ళూ కలిసి, టిక్కెట్లు తీస్తున్నారు — వక్క పొడి కొనుక్కువస్తానని కిళ్ళీకొట్టు దగ్గిరకి వెళ్ళాను.

రామావతారం అటు వచ్చేవాడల్లా — నన్ను చూసి, తప్పించుకు వెళ్ళిపోబోయాడు —

పిలిచాను — అడిగాను —

"పరీక్ష లెలారాశావు."

"పరీక్షలా!" — అని,

"బాగానేరాశాను—కాని...నీడబ్బు..." అని ఆగాడు —

"ఇప్పుడిచ్చేది తరవాత—ఆఁ—ఆనంద మోహన్‌గారున్నారా — వెళ్ళారా —" అన్నాను.

"నిన్ననే వెళ్ళాడు వాళ్ళవూరు — మళ్ళా వస్తాట్ట — నన్నొదిలి వెళ్ళడానికి ఎంతో ఇదయ్యాడు—ఈసారి వాళ్ళవూరు—తీసికెళతాడట —"

మాటాన్న — సుబ్బారావూ, మా మిత్రులూ వస్తున్నారు.

"వెళతా — మరి —" అని తొందర తొందరగా వెళ్ళిపోయాడు రామావతారం.

సుబ్బారావు వచ్చాడు — నవ్వాడు.

"ఆ వెళ్ళేవాడు రామావతారం కదూ ?" అన్నాడు.

"అవును — అదే" అన్నాను.

సుబ్బారావు మళ్ళీ అన్నాడు —

"డబ్బు అడుగుతానని భయంగాబోలు — ఏం అంటాడు నీతో ?"

"ఏం — నీ దగ్గరకూడా..."

"అంటే!— నీ దగ్గిరా నా!...."

సుబ్బారావు ఆశ్చర్యపడ్డానికి కారణం తోచలేదు నాకు;

"ఆహా - నా దగ్గిరాను - పోన్లే - పరీక్షకి కట్టుకుంటాడు అనిచ్చాను - బాగానే రాశాట్టలే పేపర్లు—" అన్నాను.

సుబ్బారావు నవ్వాడు మూడోసారి.

"ఏమిటిట రాస్తా—ఆవ్వదం. పరీక్షకి వాస్తేగా!"

"అంటే?"— ఆశ్చర్యపడ్డాను -

"డబ్బుకట్టి మానేశాడా!"-అడిగాను.

''అంత తెలివితక్కువవాడు కాడు— ఆ డబ్బు ఆనంద మోహన్‌కి కట్టాడు."

సుబ్బారావు చెప్పేది అర్థం కావటం లేదు నాకు -

మళ్ళీ అన్నాడు— "నువ్వేతారీఖున— ఏ నెలలో ఇచ్చావు — ఆడబ్బు."

చెప్పాను - నవ్వాడు విని.

"సరిగ్గా అదేరోజున — నా దగ్గిరా — ముప్ఫయిరూపాయలుపట్టుకొనిపోయాడు బజార్లో నలిపి నలిపి - అలా కొంత దూరం వెళ్ళాడో లేదో అవతలి జంక్షన్ లోంచి సైకిల్‌మీద ఆనందమోహన్ రావడం, వీడు నవ్వుతూ జేబులోంచి ఏదో తీసిఇవ్వడం- ఇద్దరూ వెళ్ళిపోవడం మాత్రం కనిపించాయి—పరీక్షకి రాలేదన్న సంగతినిజం - మరి ఆ ఇచ్చింది!! - అర్థం అయిందా - మనిద్దరికీ పెర్ఫ్యూమ్ మలామా - పోదాం — రా -"

నా మెదడు తలక్రిందు లైంది -

సినిమాకివెళ్ళినా మనస్సు మనస్సులో లేదు — ఆనందమోహన్‌కి డబ్బివాల్సిన అవసరం రామావతారాని కేం వచ్చింది!

ఒకవేళ, ఆనందమోహన్, వీడి కని పెట్టిన ఖర్చంతా - అప్పు తీర్చమని చంపాడా - ఎంతసేపూ రామావతారం ప్రాణస్నేహితుడు అనడంతప్ప, ఆ మాత్రం డబ్బున్నవాడు ఇవ్వలేడూ?

రామావతారం ఎంత చాతకానివాడో అర్థం అవుతోంది.

నమ్మితే అలా - నమ్మకసెయ్యడమే!

రామావతారాన్ని చూస్తే మళ్ళీ మరో క్షణానికి ఏం అనిపిస్తుందో మనకే తెలియదు.

ఆనందమోహన్ అపుడు కావడం మానేశాడు నాకు చాలాకాలం - ఎవళ్లూ కనిపించలేదసలు - సుబ్బారావు వాళ్ళ వూరు వెళ్ళిపోయాడు.

నా కేం తోచకండా ఓ సెలవురోజు రోడ్డుమీద తిరుగుతోన్నపుడు-

రామావతారం, 'అతనూ' కనిపించారు - మంచిడ్రస్‌లో హాయిగా కబుర్లు చెప్పుకుంటూ.

ఆనందమోహన్ పలకరించి -

"కాఫీతాగుదాంరండి-''అనిహోటల్ లోకి తీసుకువెళ్ళాడు —

చాలా బలవంతం చేసినా వినిపించుకోకుండా తనే బిల్ చెల్లించాడు.

మాట్లాడుతోండమని మాకు చెప్పి, రామావతారం మమ్మల్నిద్దర్నీ అక్కడ వదిలివెళ్ళాడు—మరో పదినిమషాల్లో వచ్చాడు - కార్టూన్ ఆర్ట్‌కి సంబంధించిన ఏవో పుస్తకాలు కొనుక్కొని.

"ఏం – నువ్వూ కాట్టాన్స్ వేద్దామనే నేవిఁటి..." అన్నాను.

రామావతారం– "ఇది మరీబాగుంది– నా కేంవచ్చూ!" అని నవ్వి – "ఆనంద మోహన్‌కి" అన్నాడు.

"ఎంతైంది ?"– అన్నాడు అనంద మోహన్ పుస్తకాలు అందుకుంటూ.

"ఎంతైతే ఎందుకురే – అప్పుడే ఇచ్చెయ్యాలేమిటి అంటూ రామావతారం కూర్చున్నాడు.

"అదేవిఁటీ ?" – అని, పుస్తకాల ధరలుచూసి, ఒక అయిదురూపాయల నోటు అతని జేబులో కుక్కుతూ –" ఇదిగో – స్నేహందారి దానిది – డబ్బు దారి డబ్బుది. ఈ రెండింటికీ కలియదు– డబ్బుదగ్గిర స్నేహితు డయ్యేది – పరమ శత్రువులా వ్యవహరించాల్సి వస్తుంది – ఒకప్పుడు... అంచేత మాట్లాడకు !" అని లేచాడు ఆనందమోహన్ వెళదా మన్నట్టు నావైపు చూసి –

ముగ్గురం ఎచ్చేశాం –

రామావతారం – అతనూ – వెళ్ళి పోయారు. సుబ్బారావుకి ఈ సంగతి చెప్పాను తరవాత వాళ్ళవూరు వెళ్ళివచ్చి నప్పు డోసారి—అతనూ తికమకపడ్డాడు.

"ఏమోమరి, మన కేం తెలుస్తుంది – ఊహించడంతప్ప" అన్నాడు.

* * *

కాలేజీలు తెరిచారు – వొస్తున్నాను – స్టేషన్‌కి వీలుచేసుకురమ్మని సుబ్బారావు ఉత్తరం రాశాడు.

ఇంకా పూర్తిగా తెల్లారలేదు.

ఓ వానజల్లు పడినట్టుండి రాత్రి – నేల తడి తడిగా ఉంది.

అప్పటికే...అప్పుడే వచ్చింది ట్రైలు – నే వెళ్ళగానే – సుబ్బారావు అప్పుడే దిగి, నాకోసంచుట్టూ చూస్తున్న వాళ్లా, నా పిలుపుతో – "వచ్చావా" – అని – ఏదో దూరంగా పట్టాలవైపు చూస్తూ.

"ఆ గుంపేవిఁటి ?" అన్నాడు.

ఎవళ్ళో చాలామంది అటువైపు పరిగెట్టి చూస్తున్నారు.

"ఏడు చూద్దాం –" అన్నాను.

వెళ్ళాం –

రోడ్డుమీద ఒకపోలీస్‌జీప్ వుంది – జనం – కేకలూ – మాటలూ –

"జేబులు వెతకండి"

"ఇదిగో – ఏదో కాగితంముక్కలు – పేరుసూ —"

"అరే :– నెత్తురు !– నోట్లు :– అబ్బ ఎన్నో :–"

"రామ రామా – చూడలేం బాబూ–" పోలీసులు జనాన్ని గెంటుతున్నారు –

శవాన్నిచూశాం.

మొహం ముద్దఅయిపోయి భయంకరంగా ఉంది.

"బాబోయ్ – చూ డ లే ం – దా – పోదాం –" అన్నాడు సుబ్బారావు.

ఇంటికి వచ్చేశాం –

రాత్రి ఎనిమిదిన్నర దాటింది.

మాసినబట్టలు లాండ్రీలో పడేద్దామని బయలుదేరాను.

లాండ్రీదగ్గిరకి వచ్చాను.

ఏదో ఘర్షణ జరుగుతోంది.

లోపల్నించి దూరంగా వినిపిస్తోంది.

లాండ్రీ ఆసామిగాబోలు –

"పంతులి కింకెప్పుడూ బట్టలివ్వ మాకండి – యెనకా ఇల్లాగే – బై యెక్కడో పారేశాడు – బుల్లిబాబుగారి పాంటుకి కన్నం యేసుకొచ్చాడు – ఆయన – ఊ – టలాయిస్తున్నాడు – పాంటుకి కన్నం పడిందని – సూడు నాయ్యా – ఈ చొక్కా యీ ప్పమీద సిరుగు – ఎల్లపయ్యా – ఎల్లింక – డబ్బా ఆలిస్యవే – అల్లా సూస్తావే –"

"అయినడబ్బా తీసుకుంటూ – రుంజుకుంటున్నాడు – రుంజుకోవడం – పొరపాటున విరిగింపంటే – ఊహూ – కొట్టుకుపోతున్నాడు – మానెయ్ – నువ్వు కాకపోతే ఇంకో డిస్తాడు –"

దురుసుగా సమాధానం –

లాండ్రీ మెట్లెక్కాను –

విసురుగా వచ్చే ఆనందమోహన్ నన్ను చూసి, ఉలికిపడి – తెల్లబోయి... మనిషి కుంచుకుపోయాడు.

లాండ్రీ అతను తిట్టే తిట్లని అతని మెదడుగ్రహించడం మానుకున్నట్టుంది.

చరచర తలొంచి చీకట్లో కెళ్ళాడు.

నా ఊహకి శక్తి పోయింది –

వెనక్కి వచ్చేశాను.

వారం తరువాత ఒక ప్రకటన చూశాను ఒక పత్రికలో –

ఒక సేట్ ఇంటో దొంగతనం చేసి. తప్పించుకు పారిపోతూ – రైలుపట్టాలు దాటబోయి – పోలీసుల ఖంగారులో – రైలుకింద పడి మరణించిన వ్యక్తి పేరు రామావతారం – విద్యార్థి – అతని జేబులో టైప్ చేసిన ఉత్తరంతాలూకు ఒకటి రెండుముక్కలు – నెత్తుర్లో తడిసిన వందరూపాయల నోరికాయి –

ఆ ఉత్తరం పూర్తిగా లేని కారణంగా – అతి ... ణం మీద తెలిసిన వాక్యం ఒకట్టే – అముక్కలు కలిపితే,

"జ్ఞాపకం ఉంది – రాత్రి వెళుతున్నా"

కింద ఏం సంతకాలులేవు – అడ్రస్ లేదు – పర్యాప్తు చేస్తున్నారు.

ఒక సంఘటన చూసినప్పుడు – వేర్వేరు మనుషులకి వేరు వేరు ఊహాలు కలుగుతాయి – కొన్ని నిజాన్ని ఆశ్రయిస్తాయి –

మరికొన్ని గాలిలో – గోలలో – కలుస్తాయి. నా కేమీ అర్థంకాలేదు.

రామావతారం చచ్చిపోయాడంటే నమ్మలేని నా ఊహతో నేను కొట్లాడడం తప్ప – కాని.

సుబ్బారావు ఆనాడు చింపిపారేసిన ఆటోగ్రాఫ్‌లో ఆనందమోహన్ వాక్యం – ఈ కథకి ముగింపు ఇవ్వగలదను కుంటున్నాను. ★